సాక్షి నిజామాబాద్

బుధవారం । 11 । అక్టోబర్ । 2023



ఏటీఎం చోరీకి యత్నం

అంక్సాపూర్ గ్రామంలో యూనియన్ బ్యాంక్ ఏటీఎంను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసేందుకు విఫల యత్నం చేశారు.

- 10లో ▸



మొరం.. అక్రమార్కులకు వరం

వ్యాపారులు నామమాత్రంగా డీడీలు చెల్లించి ఎస్సారెస్పీ వరద కాలువ కట్ట నుంచి ఇష్టారాజ్యంగా మొరం తరలిస్తున్నారు.

- 10లో ▸

గరిష్టం/కనిష్టం
34.9 /23.5

వాతావరణం

ఉదయం ఆకాశం మేఘావృతం కావచ్చు. మధ్యాహ్నం ఎండ తీవ్రత ఉంటుంది. సాయంత్రం చల్లటిగాలులు వీస్తాయి. పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్

పెరిగిన భూగర్భ జలాలు

- సెప్టెంబర్ గణాంకాల విడుదల

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లాలో భూగర్భ జలాలు పెరిగాయి. సెప్టెంబర్‌లో కురిసిన భారీ వర్షాలకు పలు ప్రాంతాల్లో నీటి మట్టాలు పెరిగినట్లు భూగర్భజల శాఖ గణాంకాలను విడుదల చేసింది. ఆగస్టులో 6.79 మీటర్ల లోతులో ఉన్న నీళ్లు, సెప్టెంబర్ ముగిసే నాటికి 5.95 మీటర్లకు చేరాయి. అంటే జలాలు దాదాపుగా ఒక మీటరు పైకి వచ్చాయి. జిల్లాలో 81 ఫీజో మీటర్లు ఉండగా, 12 ప్రాంతాల్లో 2 మీటర్ల కంటే ఎక్కువగా నీళ్లు పైకి వచ్చినట్లు భూగర్భజల శాఖ వెల్లడించింది. అలాగే భీమ్‌గల్ మండలం గొనుగొప్పులలో 21.79 మీటర్ల లోతులోకి నీటి మట్టాలు పడిపోయినట్లు పేర్కొంది.

కొనసాగుతున్న నీటి విడుదల



బాల్కొండ : శ్రీరాంసాగర్ ప్రాజెక్ట్ నుంచి ఆయకట్టు కోసం కాలువల ద్వారా నీటి విడుదల కొనసాగుతుంది. కాకతీయ కాలువ ద్వారా 6,400 క్యూసెక్కులు, లక్ష్మీకాలువ ద్వారా 200 క్యూసెక్కులు, సరస్వతీ కాలువ ద్వారా 500 క్యూసెక్కులు, అలీసాగర్ లిఫ్ట్ ద్వారా 180 క్యూసెక్కులు, ఆవిరి రూపంలో 666 క్యూసెక్కులు, మిషన్ భగీరథ ద్వారా 1,152 క్యూసెక్కుల నీటి విడుదల జరుగుతుంది. ప్రాజెక్ట్‌లోకి ఎగువ ప్రాంతాల నుంచి 8,100 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుంది. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటి మట్టం 1,091(90 టీఎంసీలు)అడుగులు కాగా అంతే స్థాయి నీటి మట్టంతో ప్రాజెక్ట్ నిండుకుండలా ఉంది.

పంచాలా..? వద్దా..?

- బతుకమ్మ చీరల పంపిణీపై అధికారుల డైలమా

డొంకేశ్వర్(ఆర్మూర్) : ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన నేపథ్యంలో జిల్లాలో బతుకమ్మ చీరల పంపిణీ తాత్కాలికంగా నిలిచింది. చీరలు పంపిణీ చేస్తే కోడ్ ఉల్లంఘనకు వస్తుందేమోనని అధికారులు డైలమాలో ఉన్నారు. జిల్లాకు 4.87లక్షల చీరలు సరఫరా కాగా, ఇప్పటి వరకు 18 ఏళ్ల నిండిన మహిళలకు 4.51లక్షల చీరలు అందజేశారు. ఇంకా పలు గ్రామాల్లో, పట్టణాల్లోని వార్డుల్లో మిగిలిన చీరలు మంగళవారం పంపిణీ చేయకుండా అధికారులు నిలిపివేశారు. చీరలు పంపిణీని పూర్తి చేయాలని ప్రభుత్వం నుంచి ఆదేశాలు న్నప్పటికీ ఒకసారి కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు దృష్టికి తీసుకెళ్లాలని, ఆయన నిర్ణయం ప్రకారమే ప్రక్రియ ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

మోస్రా శివారులో చిరుత సంచారం

వర్ని : మోస్రా మండల కేంద్రం నుంచి చింతకుంట వెళ్లే మార్గంలో చిరుత పులి సంచరిస్తున్నట్లు పశువుల కాపర్లు పేర్కొన్నారు. గత రెండు వారాలుగా చిరుత సంచరిస్తోందని భయాందోళన చెందుతున్నారు. ఈ సందర్భంగా చిరుత ఆనవాళ్లు గుర్తించేందుకు ప్రయత్నిస్తున్నట్లు ఫారెస్ట్ సిబ్బంది తెలిపారు. చిరుతను బంధించేందుకు బోను ఏర్పాటు చేస్తామన్నారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యతనివ్వాలి




నిజామాబాద్ నాగారం : ప్రస్తుత జీవనంలో ప్రతి ఒక్కరూ శారీరక, మానసిక ఆరోగ్యానికి ప్రాధాన్యత ఇవ్వాలని, దీంతో మరింత ఆరోగ్యంగా ఉంటారని సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి అన్నారు. నగరంలోని స్నేహ సొసైటీలో మంగళవారం ప్రపంచ మానసిక ఆరోగ్య దినం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. చాలా మంది కేవలం శారీరక ఆరోగ్యానికి మాత్రమే ప్రాధాన్యతనిస్తారని దీంతో అనేక ఇబ్బందులపాలవుతున్నట్లు తెలిపారు. మానసిక రోగానికి కూడా చికిత్స తీసుకుంటే మరింత ఉన్నతంగా బతుకుతారన్నారు. స్నేహసొసైటీ కార్యదర్శి సిద్దయ్య, జీజీహెచ్ సూపరింటెండెంట్ ప్రతిమారాజ్, డా.విశాల్, ఐసీడీఎస్ డీపీ రసూల్‌బీ, వీరేశం ప్రిన్సిపల్ జ్యోతి, విజయలక్ష్మి, రాజేశ్వరి పాల్గొన్నారు.

కులం.. గాలం

- ప్రణాళికలు రచిస్తున్న పార్టీలు
- కులసంఘాల వారీగా సమావేశాలు
- తాజాగా గౌడ, నాయీబ్రాహ్మణ సంఘాలతో కవిత ఆత్మీయ సమ్మేళనం
- రాజకీయ పార్టీల నుంచి రెండు సీట్లు ఆశిస్తున్న మున్నూరుకాపులు
- పార్టీలు, కులసంఘాల మధ్య దోబూచులాట

ఎన్నికల నగారా మోగడంతో అంతటా రాజకీయం వేడెక్కింది. ఓటర్లకు గాలం వేసేందుకు కార్యాచరణ షురూ చేసిన ఆయా పార్టీలు.. కులసంఘాల వారీగా మచ్చిక చేసుకునేందుకు తగిన ప్రణాళికలతో ముందుకు వెళ్తున్నాయి.



సాక్షి ప్రతినిధి, నిజామాబాద్ : జిల్లాలో అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే స్థాయిలో ఉన్న ప్రధాన కులాలను, ఇతర కులాలను వివిధ రాజకీయ పార్టీలు మచ్చిక చేసుకునే పనిలో పడ్డాయి. ఆయా సంఘాలను విడివిడిగా తమవైపు తిప్పుకుంటే గంపగుత్తగా ఓట్లు రాబట్టుకోవచ్చనే ఉద్దేశ్యంతో ఆయా కులసంఘాలతో పార్టీల నాయకులు వరుసగా ఆత్మీయ సమావేశాలు ఏర్పాటు చేసేందుకు రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చేందుకు కొన్ని రోజుల ముందు నుంచే అధికార బీఆర్‌ఎస్ పార్టీ సిట్టింగ్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు జిల్లాలో వివిధ కులసంఘాల భవనాలు, కమ్యూనిటీ హాళ్లకు సంబంధించి ప్రొసీడింగ్స్ ఇవ్వడంతో పాటు శంకుస్థాపనలు కూడా చేస్తూ వచ్చారు. కోడ్ నేపథ్యంలో కొన్నింటి శంకుస్థాపన కార్యక్రమాలు చేయలేని పరిస్థితి ఏర్పడింది. దీంతో అధికార పార్టీ అభ్యర్థులు ఆత్మీయ సమ్మేళనాల పేరుతో ముందుకు వెళ్తున్నారు. ఈ క్రమంలో తాజాగా మంగళవారం ఎమ్మెల్సీ కవిత నగరంలో గౌడ, నాయీ బ్రాహ్మణ సంఘాలతో ఆత్మీయ సమ్మేళనాలు విడివిడిగా ఏర్పాటు చేసి మాట్లాడారు. కోడ్ కారణంగా శంకుస్థాపన శిలాఫలకాలను ముట్టుకోలేదు.

మున్నూరుకాపుల గర్జన..

మరోవైపు మున్నూరుకాపు జిల్లా కమిటీ సమావేశం మంగళవారం నిజామాబాద్‌లో నిర్వహించారు. ఇందులో నగరానికి చెందిన 26 తర్పల నుంచి ప్రతినిధులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్ మాట్లాడుతూ జిల్లాలో అత్యధిక ఓట్లు కలిగి ఉన్న మున్నూరుకాపు కులానికి రాజకీయ పార్టీలు రెండు సీట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. జిల్లాలోని అన్ని నియోజకవర్గాల్లో తమ కులస్తుల ఓట్లు అత్యధికం ఉన్నాయన్నారు. తమ కులస్తులకు కేటాయించిన సీట్లను తప్పనిసరిగా గెలిపించుకుని వస్తామన్నారు. తమకున్న ఓట్ల ప్రాతిపదికన ప్రకారమే సీట్లు అడుగుతున్నామన్నారు.

బీజేపీ, కాంగ్రెస్ పార్టీల్లో..

పార్టీలు ఆత్మీయ సమ్మేళనాలు, కులసంఘాల డిమాండ్ల నేపథ్యంలో ఎన్నికల ఫీవర్ మరో ఘట్టానికి చేరుకుంది. ఇదిలా ఉండగా బీజేపీ, కాంగ్రెస్ పార్టీలు మాత్రం ఇంకా అభ్యర్థులను ఖరారు చేయకపోవడంతో కులసంఘాలు కూడా ఆయా పార్టీల అభ్యర్థుల కోసం ఎదురు చూస్తున్నాయి. ఏ పార్టీ తమకు అనుకూలమైన అభ్యర్థిని ఎంపిక చేస్తుందనే విషయమై ఎదురు చూస్తున్నారు. రెండు జాతీయ పార్టీలు కూడా కులసమీకరణాలను పరిగణలోకి తీసుకుని టిక్కెట్ల కేటాయింపు చేసేందుకు లెక్కలు వేసుకుంటుండడంతో ఉత్కంఠ వాతావరణం నెలకొంది. రోజురోజుకూ మారుతున్న పరిణామాల నేపథ్యంలో సమీకరణలు ఎలా ఉంటాయనే విషయమై రాజకీయ వర్గాల్లో, పార్టీల శ్రేణుల్లో చర్చనీయాంశమయ్యాయి.

“ మభ్యపెట్టేందుకే జిమ్మిక్కులు



ఇన్నేళ్లుగా పట్టించుకోని అధికార పార్టీ నాయకులు కేవలం మభ్యపెట్టేందుకు మాత్రమే ఇలాంటి జిమ్మిక్కులు ప్రదర్శిస్తున్నారు. ప్రజలను విభజించి పాలించు అనే సిద్ధాంతంతో కేసీఆర్ ప్రభుత్వం పనిచేస్తోంది. గ్రామాల్లో గీత కార్మికుల పొట్ట కొట్టేలా వ్యవహరించి, బెల్టు దుకాణాలను విచ్చలవిడిగా ప్రోత్సహించిన కేసీఆర్ ప్రభుత్వం ఇప్పుడు ఓట్ల కోసం డ్రామాలాడుతోంది. గీత కార్మికుల ఉపాధిని దెబ్బతీశారు. ఎన్నికలు పూర్తయ్యాక నిర్లక్ష్యం చేస్తారు. గౌడ కులస్తులందరూ ఈ అంశాలను పరిగణలోకి తీసుకుని మోసపోకుండా జాగ్రత్తగా వ్యవహరించాలి.

– దయాకర్ గౌడ్, డీసీసీ ఉపాధ్యక్షుడు

బీఆర్‌ఎస్ అంటే బీసీల ప్రభుత్వం



గౌడ ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగిస్తున్న ఎమ్మెల్సీ కవిత, పక్కన ఎమ్మెల్యే బిగాల, మేయర్ నీతూకిరణ్

- సీఎం కేసీఆర్ కులవృత్తులకు పూర్వవైభవం తెస్తున్నారు
- కాంగ్రెస్ హయాంలో బీసీలను ఎందుకు పట్టించుకోలేదు?
- రాహుల్‌గాంధీ సమాధానం చెప్పాలి
- ఆత్మీయ సమ్మేళనాల్లో ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత

నిజామాబాద్ నాగారం: బీఆర్‌ఎస్ ప్రభుత్వం అంటే బీసీల ప్రభుత్వమని, కన్నతల్లి వంటి కులవృత్తులకు బీఆర్‌ఎస్ పాలనలో పూర్వవైభవం వచ్చిందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. జిల్లా కేంద్రంలోని కంఠేశ్వర్, జనార్దన్‌గార్డెన్స్‌లో మంగళవారం నిర్వహించిన గౌడ, నాయీబ్రాహ్మణుల ఆత్మీయ సమ్మేళనాలకు కవిత ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ సీఎం కేసీఆర్ కులవృత్తులకు పూర్వవైభవం తెస్తు న్నారన్నారు. బీసీలకు 33 శాతం రిజర్వేషన్ కోసం అసెంబ్లీలో మొట్టమొదట తీర్మానం చేసిన నాయకుడు సీఎం కేసీఆర్ అని అన్నారు. డీఎస్, షబ్బీర్ వంటివారు పనిచేసినా అభివృద్ధి చేయలేదన్నారు. జిల్లాకు ఒకటే బీసీ హాస్టల్ ఉండేదని, ప్రస్తుతం 15 హాస్టళ్లను ఏర్పాటు చేసుకున్నామన్నారు. కాంగ్రెస్ హయాంలో బీసీలను ఎందుకు పట్టించుకోలేదో రాహుల్‌గాంధీ చెప్పాలన్నారు. బీసీ గణన ఎందుకు చేపట్టలేదని ప్రశ్నించారు. ప్రభుత్వం పాలసీగా తీసుకొని ఈత వనాలను పెంచుతున్నదని, మద్యం దుకాణాల టెండర్లలో గౌడకులస్తులకు 15శాతం రిజర్వేషన్ ఇస్తున్నదన్నారు. సర్వాయి పాపన్నగౌడ్ జయంతిని అధికారికంగా నిర్వహిస్తున్నామన్నారు. సెలూన్లకు సబ్సిడీపై విద్యుత్ ఇస్తున్నామని, 12 లక్షల మంది కళ్యాణలక్ష్మి లబ్ధిదారుల్లో 7లక్షల మంది బీసీలు ఉన్నారన్నారు.

మళ్లీ వచ్చేది మనమే :

– బిగాల



రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వమే వస్తుందని అర్బన్ ఎమ్మెల్యే బిగాల గణేశ్‌గుప్తా అన్నారు. ఆత్మీయసమ్మేళనాల్లో ఆయన ప్రసంగించారు. బీమాతో కల్లుగీత కార్మికులకు ధీమా ఇస్తూ, ఆసరా పింఛన్లతో భద్రత ఇచ్చామన్నారు. గౌడభవనం నిర్మిస్తామన్నారు. జిల్లా కేంద్రంలో నీరా కేఫ్‌లు ఏర్పాటు చేస్తామన్నారు. గౌడ భవనానికి ఎమ్మెల్సీ కవిత, తాను రూ. రూ.50 లక్షల చొప్పున మంజూరు చేశామన్నారు. నిజామాబాద్ సొసైటీని రద్దు చేస్తే సీఎం దృష్టికి తీసుకెళ్లి సొసైటీని పునరుద్ధరించినట్లు తెలిపారు. నగరంలో నాయీబ్రాహ్మణులందరికీ రూ.లక్ష చొప్పున ఆర్థిక సాయం చేశామన్నారు. మోడ్రన్‌సెలూన్ నిర్మాణానికి రూ.50లక్షలు మంజూరు చేశామన్నారు. తనను ఎమ్మెల్యేగా, కవిత ను ఎంపీగా గెలిపిస్తే మీకు మరింత సేవ చేస్తామన్నారు. మేయర్ నీతూకిరణ్, తెలంగాణ ఉమెన్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ చైర్‌పర్సన్ ఆకుల లలిత, వీజీ గౌడ్, నుడా మాజీ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి, రెడ్కో మాజీ చైర్మన్ అలీం, కార్పొరేటర్లు ఉమారాణి శ్రీనివాస్, కోమల్, సాయివర్ధన్, బట్టు రాఘవేందర్, విక్రమ్‌గౌడ్, మల్లేశ్‌యాదవ్, పట్నం విక్రమ్ గౌడ్, గౌడ సంఘం నాయకులు నారాయణగౌడ్, శ్రీనివాస్‌గౌడ్, అంబటి శ్రీను, రమణాగౌడ్, నరేందర్‌గౌడ్, అంతరెడ్డి దేవిభూమేశ్వర్, సీతారాం తదితరులున్నారు.

మద్యం విక్రయాలపై నిఘా

- పరిగణనలోకి 2018 అక్టోబర్, నవంబర్ నెలల రోజువారీ అమ్మకాలు
- కోడ్ నేపథ్యంలో వైన్ షాపుల యజమానులకు ఆదేశాలు
- మందు పంపిణీ కట్టడికి ఎక్సైజ్ అధికారుల చర్యలు

మోర్తాడ్(బాల్కొండ): ఎన్నికల్లో పోటీచేసే అభ్యర్థులు ఓటర్లను ప్రలోభపెట్టేందుకు మద్యం పంపిణీ చేసే అవకాశాలు ఉండటంతో ఎక్సైజ్‌శాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఎన్నికల కోడ్ అమలులోకి రావడంతో మద్యం విక్రయాలపై నిఘా పెంచారు. 2018 అక్టోబర్, నవంబర్ నెలల్లో మద్యం అమ్మకాలు ఎంత జరిగాయో.. ఆ మేరకే ఇప్పుడు కూడా విక్రయాలు ఉండాలని వైన్‌షాపుల యజమానులకు ఎక్సైజ్‌శాఖ ఆదేశాలు జారీ చేసింది. 2018తో పోలిస్తే ప్రస్తుతం ఐఎంఎల్ డిపోల నుంచి మద్యం కొనుగోలు చేయడానికి వీలులేకుండా కట్టడి చేశారు. ఇందులో భాగంగా జిల్లాలోని 102 మద్యం దుకాణాలపై సోమవారం నుంచి నిఘా పెంచారు. ఎన్నికల్లో మద్యం పంచి ఓటర్లను ప్రభావితం చేయకుండా ఎక్సైజ్‌శాఖతోపాటు ఎన్నికలను సక్రమంగా నిర్వహించేందుకు ఏర్పడిన సర్వైవల్, టాస్క్‌ఫోర్స్, మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ బృందాలు పని చేయనున్నాయి. అలాగే ఎవరైనా పరిమితికి మించి మద్యం తరలించినా ఎక్సైజ్, పోలీసుశాఖలు పట్టుకుని బాటిళ్లను సీజ్ చేయడంతోపాటు కేసులు నమోదు చేయనున్నారు. ఒక వ్యక్తికి పరిమితికి మించి మద్యం విక్రయిస్తే వైన్‌షాపులను సీజ్ చేసి క్రిమినల్ కేసులు నమోదు చేసే అవకాశముందని అధికారవర్గాలు పేర్కొంటున్నాయి.

“ అమ్మకాలపై నియంత్రణ ఉంది

ఎలక్షన్ కోడ్ అమలులోకి వచ్చిన తరుణంలో మద్యం అమ్మకాలు పరిమితంగానే సాగాల్సి ఉంది. అమ్మకాలను నియంత్రించి ఎన్నికలను సజావుగా నిర్వహించడానికి ఎన్నికల సంఘానికి తమ శాఖ సహకరిస్తుంది. దుకాణాల యజమానులు నిబంధనలను ఉల్లంఘించొద్దు.

– గుండప్ప, సీఐ ఎక్సైజ్ శాఖ, మోర్తాడ్

విద్యార్థినులను వేధిస్తే కఠిన చర్యలు

ఖలీల్‌వాడి : ఎవరైనా ఆకతాయిలు విద్యార్థినులను మహిళలను వేధింపులకు గురి చేసినట్లయితే వారిపై కఠినచర్యలు తీసుకుంటామని సీపీ సత్యనారాయణ పేర్కొన్నారు. మంగళవారం జిల్లా కేంద్రంలోని సీపీ కార్యాలయంలో సమావేశంలో ఆయన మాట్లాడారు. పోలీస్ కమిషనరేట్ పరిధిలోని నిజామాబాద్, ఆర్మూర్, బోధన్ డివిజన్‌లోని షీ టీం బృందాలను నిఘా ఉంచామని, విద్యార్థులు, మహిళలతో అసభ్యంగా ప్రవర్తించిన, వేధించినా.. షీటీం నం. 87126 59795కు గాని డయల్ 100కు ఫోన్ చేసి తెలపాలన్నారు. సెప్టెంబర్ 01వ తేదీ నుంచి 30వ తేదీవరకు పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిజామాబాద్‌లో 6, ఆర్మూర్‌లో 2, బోధన్‌లో 2 సంఘటనలు జరిగాయన్నారు. నిజామాబాద్ జిల్లాలో 7, ఆర్మూర్‌లో ఇద్దరు, బోధన్‌లో ముగ్గురు మొత్తం 12 పట్టుబడినట్లు తెలిపారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు

- ఎన్నికల ఖర్చు పరిశీలనకు ప్రత్యేక బృందాలు
- అభ్యర్థులు ఎప్పటికప్పుడు వివరాలు అందించాలి
- సభలు, సమావేశాలకు 48 గంటల ముందే అనుమతి తీసుకోవాలి
- కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



మాట్లాడుతున్న కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు



పాల్గొన్న రాజకీయ పార్టీల ప్రతినిధులు

ఖలీల్‌వాడి: ఎలక్షన్ కమిషన్ నిబంధనలను ఉల్లంఘిస్తే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అన్నారు. ఎన్నికల ఖర్చును నిశితంగా పరిశీలించేందుకు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశామని, అన్ని పార్టీలకు చెందిన అభ్యర్థులు ఎన్నికల వ్యయ వివరాలను ఎప్పటికప్పుడు సంబంధిత అధికారులకు అందించాలన్నారు. జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని వీడియోకాన్ఫరెన్స్‌హాల్‌లో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టర్ మంగళవారం సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికలు ప్రశాంతంగా జరగడానికి రాజకీయ పార్టీలు సహకరించాలని కోరారు. అసెంబ్లీకి పోటీచేసే అభ్యర్థి రూ.40 లక్షలకు మించకుండా ఖర్చు చేయాల్సి ఉంటుందని తెలిపారు. సభలు, సమావేశాలు, ర్యాలీల అనుమతుల కోసం కనీసం 48గంటల ముందు దరఖాస్తు చేసుకోవాలని చెప్పారు. ఎలక్షన్ కోడ్ ఉల్లంఘనపై టోల్ ఫ్రీ నంబర్ 1950కు లేదా సీ-విజిల్ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చన్నారు. ఫిర్యాదు అందిన వెంటనే ఫ్లయింగ్ స్క్వాడ్ బృందాలు స్పందిస్తాయని, బృందాల కదలికలను సైతం యాప్ ద్వారా ట్రాక్ చేసే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు.

వృద్ధులకు ఇంటినుంచే ఓటువేసే అవకాశం

80 సంవత్సరాలు దాటిన ఓటర్లు, ఓటరు జాబితాలో మార్కింగ్ కలిగిన దివ్యాంగ ఓటర్లకు తమ ఇంటి నుంచే ఓటువేసే వెసులుబాటు ఉందని కలెక్టర్ తెలిపారు. అవసరమైన వారు 12–డీ ఫారం నింపి నవంబర్ 7వ తేదీలోగా బీఎల్ఓలకు అందజేయాలని సూచించారు.

ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హనుమంతు అధికారులను ఆదేశించారు. నోడల్ అధికారులతో నిర్వహించిన సమీక్షాసమావేశంలో కీలక సూచనలు చేశారు. ఎన్నికల నిర్వహణకు ర్యాండమైజేషన్ ద్వారా సిబ్బంది నియామకాలు చేపట్టాలన్నారు. కనీసం 20 శాతం సిబ్బందిని రిజర్వు లో ఉంచాలని, పోలింగ్, కౌంటింగ్ విధుల కోసం వేర్వేరుగా సిబ్బందిని నియమించి శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. కోడ్ ఉల్లంఘనకు సంబంధించిన ఫిర్యాదులపై క్షేత్రస్థాయిలో విచారణ చేపట్టి నివేదిక అందించాలన్నారు. అదనపు కలెక్టర్ పి.యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, నోడల్ అధికారులు పాల్గొన్నారు.

కళాశాలల పరిశీలన

ఖలీల్‌వాడి : ఎన్నికల నిర్వహణ ఏర్పాట్లలో భాగంగా కలెక్టర్ రాజీవ్ గాంధీ హనుమంతు, సీపీ సత్యనారాయణ మంగళవారం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ బాలుర, బాలికల పాలిటెక్నిక్ కళాశాలలు, సీఎస్ఐ జూనియర్ కాలేజీని పరిశీలించారు. సాధారణ ఎన్నికల నోటిఫికేషన్ రావడంతో ఓట్ల లెక్కింపు, ఎన్నికల సామగ్రి పంపిణీ, ఈవీఎంను భద్రపర్చేందుకు స్ట్రాంగ్‌రూం వంటి వాటికి అనువుగా ఉన్న కేంద్రాలను పరిశీలించారు.భవనాలకు లీకేజీలు ఉంటే చూడాలని ఆర్‌అండ్‌బీ ఇంజినీర్లను కలెక్టర్ ఆదేశించారు. అదనపు కలెక్టర్ యాదిరెడ్డి, అదనపు డీసీపీ జయరాం, అగ్నిమాపక శాఖ అధికారి మురళి మనోహర్, ఆర్డీవో రాజేంద్ర కుమార్, ఏసీపీ కిరణ్ కుమార్, ఎన్నికల విభాగం పర్యవేక్షకుడు పవన్ తదితరులు పాల్గొన్నారు.



వివరాలు తెలుసుకుంటున్న కలెక్టర్

చేపల మార్కెట్‌కు మోక్షమెప్పుడో..?

- అర్సపల్లిలో మొదలుకాని పనులు
- శంకుస్థాపనకే పరిమితమైన ప్రక్రియ
- ప్లాన్‌లేక నిలిచిన రూ. 2 కోట్ల టెండరు



అర్సపల్లిలో చేపల మార్కెట్ భవనానికి శంకుస్థాపన చేసిన మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ (ఫైల్)

డొంకేశ్వర్(ఆర్మూర్) : జిల్లా కేంద్రంలోని అర్సపల్లి చేపల మార్కెట్ పనులకు ఒక్క అడుగు కూడా ముందుకు పడలేదు. మత్స్యశాఖ మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ మార్కెట్ భవనానికి శంకుస్థాపన చేసి నెల రోజులు కావస్తున్నా ఇంతవరకు ప్లాన్ మ్యాప్ సిద్ధం కాలేదు. దీంతో టెండర్ల ప్రక్రియ నిలిచిపోయింది. జిల్లాలో మత్స్య సంపదతో పాటు మత్స్యకార కుటుంబాలు కూడా ఎక్కువగా ఉన్నాయి. 350కి పైగా మత్స్యకార సొసైటీలు కూడా ఉన్నాయి. ఐతే, చేపల క్రయ, విక్రయాలకు మత్స్యకారులకు ప్రత్యేకంగా మార్కెట్ లేకపోవడంతో దళారులకే విక్రయిస్తున్నారు. తద్వారా మత్స్యకారుల కంటే దళారులే ఎక్కువ లాభాలు పొందుతున్నారు. దళారుల వ్యవస్థ లేకుండా పట్టిన చేపలను నేరుగా మత్స్యకారులే ఎగుమతి చేసునేందుకు జిల్లా కేంద్రంలోని అర్సపల్లిలో ఉన్న మత్స్య శాఖ స్థలంలో హోల్‌సేల్ అండ్ రిటైల్ మార్కెట్‌ను నిర్మించాలని మత్స్యకార సంఘాలు ప్రభుత్వాన్ని కోరాయి. మార్కెట్‌తో పాటు కోల్డ్ స్టోరేజీ, ఇతర భవనాలను నిర్మించడానికి రూ. 10 కోట్లు మంజూరు చేయాలని ప్రతిపాదనలు మత్స్య శాఖ నుంచి వెళ్లాయి. కానీ, ప్రభుత్వం ఈ ఏడాది జూలైలో రూ. 2 కోట్లు మంజూరు చేస్తూ ఉత్తర్వులిచ్చింది. నాలుగు ఎకరాల స్థలం ఉండగా, రెండెకరాల్లో ఫిష్ మార్కెట్‌ను నిర్మించడానికి సెప్టెంబర్ 14న మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ జిల్లాకు వచ్చి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. మ్యాప్ ఉంటేగాని టెండర్లు పిలిచే అవకాశం లేదని ఆర్‌అండ్‌బీ అధికారులు చెప్తున్నారు. రూ. 2 కోట్లకు గాను ప్రస్తుతం రూ. 1 కోటి నిధులు రాష్ట్ర శాఖ మంజూరు చేసింది. జిల్లా శాఖ ఖాతాలోకి రావాల్సి ఉంది. అదేవిధంగా డిచ్‌పల్లిలో రూ. 50 లక్షలతో నిర్మించనున్న చేపల మార్కెట్‌కు కూడా మంత్రి తలసానియే శంకుస్థాపన చేశారు. పంచాయతీరాజ్ అధికారులు టెండర్లు ఆహ్వానించారు.

“ ప్లాన్ రావాల్సి ఉంది

అర్సపల్లి చేపల మార్కెట్ నిర్మాణం కోసం ప్లాన్ మ్యాప్‌ను తెప్పించుకునే పనిలో ఉన్నాం. వీలైనంత త్వరగా ఆర్కిటెక్చర్ ద్వారా ప్లాన్ సిద్ధం చేసి ఆర్‌అండ్‌బీ అధికారులకు ఇస్తాం. వారు టెండర్లు పిలిచి పనులు ప్రారంభిస్తారు.

– రాజనర్సయ్య, జిల్లా మత్స్య శాఖ అధికారి

జిల్లాలో జోరుగా తనిఖీలు



నగరంలో తనిఖీలు చేస్తున్న పోలీసులు

ఖలీల్‌వాడి/నవీపేట/బోధన్‌టౌన్/ఆర్మూర్ టౌన్ : నగరంలోని మూడవ టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని సీఎస్ కాలనీలో వాహనాల తనిఖీలను ఏసీపీ కిరణ్ కుమార్, టౌన్ సీఐ నరహరి పరిశీలించారు. తనిఖీలలో ఎస్సై ప్రవీణ్, పోలీసు సిబ్బంది ఉన్నారు. నవీపేట మండల కేంద్రంలోని కందకుర్తి క్రాసింగ్ వద్ద మంగళవారం సాయంత్రం వాహనాలు తనిఖీలు చేస్తుండగా రూ. 3 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై యాదగిరిగౌడ్ తెలిపారు. ఎన్నికల కోడ్ నేపథ్యంలో వాహనాలు తనిఖీ చేస్తుండగా నవీపేట నుంచి అభంగపట్నం వైపు బైక్‌పై వెళ్తున్న శ్యాంరావ్ దగ్గర రూ. 3 లక్షల నగదును లభ్యమైందన్నారు. నగదుకు సంబంధించి ఏలాంటి పత్రాలు లేకపోవడంతో నగదును స్వాధీనం చేసుకున్నామన్నారు.

సాలూరా చెక్‌పోస్ట్ వద్ద..

సాలూర చెక్ పోస్టు వద్ద మంగళవారం పోలీసులు రూ. 60 వేల నగదును స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై నాగ్‌నాథ్ తెలిపిన వివరాల ప్రకారం మహారాష్ట్రలోని బిలోలికి చెందిన షరీఫ్ బైక్‌పై బోధన్‌కు వస్తుండగా తనిఖీ చేయగా రూ. 60 వేలు లభించాయని, ఎలాంటి ఆధారాలు లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు. బోధన్ పట్టణంలోని కొత్త బస్టాండ్ వద్ద సోమవారం రాత్రి పోలీసులు తనిఖీలు నిర్వహిస్తు రూ. 5 లక్షల నగదును స్వాధీనం చేసుకున్నారు. పట్టణంలోని సీఐ ప్రేమ్‌కుమార్ తెలిపిన ప్రకారం నిజామాబాద్ బల్దియాలో పనిచేస్తున్న అబ్దుల్ లతీఫ్ బైక్‌ను తనిఖీ చేయగా రూ. 5లక్షలు లభించాయని, తన స్థలం అమ్మితే డబ్బులు వచ్చాయని ఆయన తెలిపినప్పటికీ ఆధారాలు చూపకపోవడంతో స్వాధీనం చేసుకున్నామన్నారు.

ఆర్మూర్ పట్టణంలో..

ఆర్మూర్ పట్టణంలోని ఓ వ్యక్తి వద్ద రూ. 12,2800 నగదు స్వాధీనం చేసుకున్నామని, ఎలాంటి ఆధారాల లేకపోవడంతో స్వాధీనం చేసుకున్నామని ఎస్‌హెచ్‌వో తెలిపారు.

క్లుప్తంగా

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక



డిచ్‌పల్లి: మండలంలోని ధర్మారం(బి) తెలంగాణ సాంఘిక సంక్షేమ పాఠశాల విద్యార్థులు సుద్దపల్లిలో నిర్వహించిన జిల్లా స్థాయి బేస్‌బాల్‌ పోటీల్లో ప్రతిభ చూపిన వర్షిణి, నందన, ఐశ్వర్య, లాస్య, శ్రీనిత్య, సుధీర రాష్ట్ర స్థాయికి ఎంపికైనట్లు ప్రిన్సిపాల్‌ సంగీత తెలిపారు. ఈనెల 12 నుంచి 14 వరకు సికింద్రాబాద్‌ ఉస్మానియా యూనివర్శిటీలో నిర్వహించే రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. అనంతరం విద్యార్థినులను ఉపాధ్యాయులు అభినందించారు. ఫిజికల్‌ డైరెక్టర్‌ నీరజారెడ్డి, పీఈటీ జ్యోత్స్న, హౌస్‌ మాస్టర్‌ లత, మమత, స్కూల్‌ సిబ్బంది ఉన్నారు.

టీయూ అర్థశాస్త్ర విభాగాధిపతిగా పున్నయ్య



డిచ్‌పల్లి: తెయూ ఇన్‌చార్జి వీసీ వాకాటి కరుణ ఆదేశాల మేరకు రిజిస్ట్రార్‌ యాదగిరి అర్థశాస్త్ర విభాగాధిపతిగా పున్నయ్యకు మంగళవారం నియామకపు ఉత్తర్వులు అందజేశారు. ప్రస్తుతం అర్థశాస్త్ర విభాగం పాఠ్యప్రణాళిక సంఘం చైర్మన్‌గా విశ్వవిద్యాలయంలో పబ్లిక్‌ రిలేషన్‌ ఆఫీసర్‌గా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. అనంతరం పున్నయ్య ఇన్‌చార్జి వీసీ కరుణ, రిజిస్ట్రార్‌ యాదగిరికి కృతజ్ఞతలు తెలిపారు.

మొరం.. అక్రమార్కులకు వరం

- రెవెన్యూ, ఎస్సారెస్పీ ప్రాజెక్టు అధికారుల మధ్య లోపించిన సమన్వయం
- అవకాశంగా మలుచుకుంటున్న వ్యాపారులు
- జోరుగా వరద కాలువ నుంచి తవ్వకాలు



బోదేపల్లి శివారులో వరద కాలువ నుంచి టిప్పర్లతో తరలిస్తున్న మొరం

బాల్కొండ: రెండు శాఖల మధ్య లోపించిన సమన్వయంతో వ్యాపారులు తమ అవకాశంగా మలుచుకొని నిబంధనలకు విరుద్ధంగా మొరాన్ని అక్రమంగా తరలిస్తూ ప్రభుత్వ ఖజానాను కొల్లగొడుతున్నారు. ఎస్సారెస్పీ, రెవెన్యూ అధికారుల మధ్య నెలకొన్న కోల్డ్‌వార్‌తో వ్యాపారులు ఎస్సారెస్పీ నుంచి నీటి సరఫరా చేసే వరద కాలువ కట్ట నుంచి నామమాత్రపు డీడీలు చెల్లించి నిత్యం వందల సంఖ్యలో టిప్పర్లతో మొరాన్ని అక్రమంగా తరలిస్తున్నారు. అధికారుల నిర్లక్ష్యం, మామూళ్ల మత్తుతో వారి వ్యాపారం జోరుగా సాగుతోంది. భవిష్యత్‌లో వరద కాలువకు ఎక్కడైన గండి ఏర్పడితే పూడ్చేందుకు మొరం లేకుండా పోతోంది. ఫలితంగా ఆయకట్టు రైతులు ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితులు నెలకొన్నాయి. అసలు వరద కాలువ నుంచి మొరం తవ్వకాలు చేపట్టేందుకు ప్రాజెక్ట్‌ అధికారులు అనుమతివ్వాలి. వ్యాపారులు క్యూబిక్‌ మీటర్‌కు రూ. 133 ప్రభుత్వానికి డీడీ రూపంలో చెల్లించి, ప్రాజెక్ట్‌ అధికారుల పర్యవేక్షణలో మొరం తవ్వకాలు చేపట్టాలి. కానీ ఇక్కడ ఇదందా ఏమీ కనిపించడం లేదు. రెవెన్యూ, ప్రాజెక్ట్‌ అధికారుల మధ్య సమన్వయ లోపాన్ని అవకాశంగా మలుచుకుని మొరం దందాను జోరుగా కొనసాగిస్తున్నారు. నామ మాత్రంగా డీడీ చెల్లించి రోజంతా మొరం తవ్వకాలు చేపడుతున్నారు. వరద కాలువ కట్ట నుంచి మొరం తరలిస్తే కట్ట పరిస్థితి ఏంటని ఆయకట్టు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

అసలు ఎవరి ఆధీనంలో..

ఎస్సారెస్పీ పునరుజ్జీవన పథకానికి, మిగులుజలాలను సద్వినియోగపర్చేందుకు నిర్మించిన వరద కాలువ ప్రాజెక్ట్‌ అధికారుల ఆధీనంలో ఉంది. వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు ప్రాజెక్ట్‌ అధికారులు అనుమతివ్వాలి. కానీ కొంత కాలంగా రెవెన్యూ అధికారులు, తహసీల్దార్లు వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు అనుమతులు ఇస్తున్నారు. దీనికి గతంలో కలెక్టర్‌గా విధులు నిర్వర్తించిన నారాయణరెడ్డి ఉత్తర్వులు ఇచ్చినట్లు రెవెన్యూ అధికారులు తెలుపుతున్నారు. ఇదిలా ఉంటే ప్రాజెక్టు ఆధీనంలో ఉన్న వరద కాలువ నుంచి రెవెన్యూ అధికారులు మొరం తవ్వకాలకు అనుమతులు ఇచ్చేది లేదని వారు పేర్కొంటున్నారు. దీంతో ఈ రెండు శాఖల మధ్య కోల్డ్‌ వార్‌ కొనసాగుతోంది. దీన్ని తమ అవకాశంగా మలుచుకున్న మొరం వ్యాపారులు ఒక శాఖకు, మరో శాఖ అనుమతిచ్చింది ఇచ్చిందంటూ యథేచ్ఛగా మొరంగా తరలిస్తున్నారు.

గుట్టలనూ తోడేస్తున్నారు..

బాల్కొండ మండల కేంద్రంలో సమీకృత హాస్టల్‌ భవనం వెనుక, కేజీబీవీ పాఠశాల పక్కన ఉన్న గుట్టలను మొరం వ్యాపారులు తేడోస్తున్నారు. ప్రస్తుతం వీరి కన్ను వరద కాలువపై పడడంతో మొరం వ్యాపారం జోరుగా కొనసాగుతోంది. రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై గుట్టలను ఖాళీ చేశారు. ఇప్పుడు ప్రాజెక్ట్‌ అధికారుల కళ్లు గప్పి రెవెన్యూ అధికారులు అనుతిస్తున్నారంటూ వరద కాలువను సైతం ఖాళీ చేస్తున్నారు. మండల కేంద్రంలో అక్రమార్కులు గుట్టలను తవ్వేసినా సంబంధిత అధికారులు ఇప్పటి వరకు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. దీంతో వారికి అందాల్సిన ముడుపులు అందాయనేది తేటతెల్లమవుతోంది. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి తగు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

ప్రాజెక్టు అధికారులకే అధికారం

వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు రెవెన్యూ అధికారులు అనుమతివ్వడానికి లేదు. మొరం అక్రమంగా తరలిస్తే సీజ్‌ చేసే అధికారం మాకు ఉంది. కానీ రెవెన్యూ అధికారులు అనుమతిచ్చి విక్రయిస్తున్నారు. గతంలో కలెక్టర్‌ ఇచ్చిన ఆర్డర్‌ కాపీని చూయించాలని రెవెన్యూ అధికారులను పలుమార్లు కోరాం. సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తాం.

– చక్రపాణి, ఈఈ, ఎస్సారెస్పీ

నిబంధనల మేరకే..

వరద కాలువ నుంచి మొరం తరలించేందుకు రెవెన్యూ శాఖకే అనుమతి ఉంది. నిబంధనల ప్రకారం డీడీ రూపంలో చలాన్‌ చెల్లించిన తరువాతే అనుమతిస్తున్నాం. నిబంధనల ప్రకారమే వరద కాలువ నుంచి మొరం తవ్వకాలకు అనుమతిస్తున్నాం. తవ్వకాల్లో మోసం జరిగినట్లు ఎవరైనా ఫిర్యాదు చేస్తే తగు చర్యలు తీసుకుంటాం.

– శ్రీధర్‌, తహసీల్దార్‌, బాల్కొండ

కోరుట్ల బరిలో 'ధర్మపురి'..!

- పసుపు బోర్డు ప్రకటనతో జోష్‌
- ముత్యంపేట షుగర్‌ ఫ్యాక్టరీ పునఃప్రారంభానికి హామీ?



సాక్షిప్రతినిధి,కరీంనగర్‌: నిజామాబాద్‌ ఎంపీ ధర్మపురి అర్వింద్‌ కోరుట్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి బీజేపీ అభ్యర్థిగా బరిలో దిగుతారన్న ప్రచారం ఊపందుకుంది. బీజేపీ అధిష్టానం పార్లమెంట్‌ సభ్యులను ప్రస్తుత శాసనసభ ఎన్నికల్లో తమ పరిధిలోని అసెంబ్లీ సీట్లకు పోటీ చేయాల్సిందేనని పార్టీ ఆదేశించడంతో ఎంపీలు తమకు అనుకూలమైన అసెంబ్లీ సీట్లల్లో బరిలో నిలిచేందుకు సమాయత్తమవుతున్నారు. నిజామాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ నియోజక వర్గంలో సొంత సామాజిక వర్గం ఓట్లు ఎక్కువగా ఉండటం, ఇటీవలే ప్రధాని నరేంద్రమోదీ నిజామాబాద్‌ బహిరంగసభలో పసుపు బోర్డును మంజూరు చేస్తున్నట్లు ప్రకటించడం.. ఎన్నోఏళ్లుగా మూతపడ్డ షుగర్‌ ఫ్యాక్టరీని ప్రధాని మోదీ, అమిత్‌షాల దృష్టికి తీసుకెళ్లానని త్వరలోనే పునః ప్రారంభింపజేస్తాననే హామీతో అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్లు అడిగేందుకు సమాయత్తమవుతున్నట్లు సమాచారం. కోరుట్ల నియోజక వర్గంలో పసుపు, చెరుకు పంటలు పండించే రైతులు అత్యధికంగా ఉండటం ఎన్నికల్లో కలిసొస్తుందనే ఆశాభావంతో కోరుట్ల నుంచే పోటీ చేసేందుకే మొగ్గు చూపుతున్నట్లు వినికిడి. బీజేపీ పార్టీకి క్షేత్రస్థాయిలో ఇప్పటికి కార్యకర్తలు, నాయకులకు కొదవలేకపోవడం కూడా పార్టీ గెలుపుణకు దోహదపడుతుందని భావించిన ఎంపీ ధర్మపురి అర్వింద్‌ ఆర్మూర్‌ అసెంబ్లీ సీటుకన్న కోరుట్లలో విజయం సాధించడం సులువు అవుతుందని భావిస్తున్నట్లు సమాచారం. బీజేపీ కేంద్ర కమిటీ నాయకులు పార్లమెంట్‌ సభ్యులంతా అసెంబ్లీ ఎన్నికల్లో తమ పార్లమెంట్‌ పరిధిలోని ఏదోఒక అసెంబ్లీ నుంచి పోటీ చేయాల్సిందేనని స్పష్టం చేయడంతో నిజామాబాద్‌ పార్లమెంట్‌ పరిధిలోని కోరుట్ల అసెంబ్లీ నుంచి బరిలో దిగేందుకే ఎంపీ ధర్మపురి అర్వింద్‌ ఓ నిర్ణయానికి వచ్చినట్లు ఆ పార్టీ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం..



ఈ ఆటోను చూశారా.. స్కూల్‌ విద్యార్థులతో కలిసి ప్రమాదకరంగా ఎలా వెళ్తుందో.. ఇది చూసినవారందరూ విద్యార్థుల ప్రాణాలతో చెలగాటం తగదు ఆటో అన్నా అంటూ డ్రైవర్‌ను మందలించారు. నగరంలోని ఆర్టీసీ కాలనీలో ఓ స్కూల్‌కు చెందిన విద్యార్థులను ఇలా ప్రమాదకరంగా తీసుకెళ్తున్న దృశ్యం 'సాక్షి' తన కెమెరాలో బంధించింది.

– నిజామాబాద్‌ అర్బన్‌

రిజిస్ట్రార్‌ యాదగిరికి సన్మానం



తెయూ(డిచ్‌పల్లి): తెయూ అర్థశాస్త్ర విభాగం ఆధ్వర్యంలో రాష్ట్ర ఉత్తమ అధ్యాపక అవార్డు పొందిన రిజిస్ట్రార్‌ యాదగిరిని అధ్యాపకులు మంగళవారం ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అర్థశాస్త్ర విభాగాధిపతి పున్నయ్య, అధ్యాపకులు రవీందర్‌రెడ్డి, పాత నాగరాజు, సంపత్‌, స్వప్న, శ్రీనివాస్‌ తదితరులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

నిజామాబాద్‌ నాగారం : 2023–24 విద్యాసంవత్సరానికి గాను జిల్లాలోని ఇంటర్‌ పూర్తిచేసుకున్న ఏదైనా గ్రూప్‌ విద్యార్థినులు, మహిళలు ఏఎన్‌ఎం/ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) కోర్సు ల్లో భాగంగా మొదటి సంవత్సరంలో ప్రవేశానికి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు సరస్వతి ఎంపీహెచ్‌డబ్ల్యూ (మహిళ) శిక్షణ సంస్థ ప్రిన్సిపల్‌ మహేశ్‌ కుమార్‌ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 20లోపు దరఖాస్తు చేసుకోవాలని, ఇతర వివరాలకు 90598 88512 సంప్రదించాలన్నారు.

అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా వసంత్‌



ఖలీల్‌వాడి: నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ సీనియర్‌ న్యాయవాది బంటు వసంత్‌ను అదనపు పబ్లిక్‌ ప్రాసిక్యూటర్‌గా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వ ప్రిన్సిపల్‌ సెక్రటరీ జితేందర్‌ మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఈ సందర్భంగా వసంత్‌కు రాష్ట్ర బార్‌ కౌన్సిల్‌ సభ్యుడు మంథని రాజేందర్‌రెడ్డి, నిజామాబాద్‌ బార్‌ అసోసియేషన్‌ అధ్యక్షుడు దేవదాసు, సీనియర్‌ న్యాయవాదులు బండారి కృష్ణానంద్‌, ఆకుల రమేశ్‌, పి.రాజు, బిట్ల రవి, దాసరి పుష్యమిత్ర తదితరులు శుభాకాంక్షలు తెలిపారు.

నవంబర్‌ 3న కైసర్‌ స్పోర్ట్స్‌ టోర్నీ

నిజామాబాద్‌నాగారం: కైసర్‌ స్పోర్ట్స్‌ అకాడమీ ఆధ్వర్యంలో అథ్లెటిక్స్‌, ఫుట్‌బాల్‌ పోటీలను నగరంలోని రాజారాం స్టేడియంలో నవంబర్‌ 3 నుంచి 5 వరకు నిర్వహించనున్నట్లు ఆర్గనైజర్‌ సయ్యద్‌ కైసర్‌ మంగళవారం తెలిపారు. అండర్‌–16, అండర్‌–19 విభాగాల్లో బాలబాలికలకు పోటీలు ఉంటాయన్నారు. మరిన్ని వివరాలకు 9849283407 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

క్రైం కార్నర్‌

గంజాయి విక్రయిస్తున్న నలుగురి అరెస్ట్‌



భీమ్‌గల్‌: మండల కేంద్రంలో గంజాయి విక్రయిస్తున్న నలుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై హరిబాబు తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రంలో పెట్రోలింగ్‌ నిర్వహిస్తుండగా బడా భీమ్‌గల్‌ శివారులోని పెదగంటి ఎల్లమ్మ ఆలయం వద్ద నలుగురు వ్యక్తులు గంజాయి విక్రయిస్తున్నారన్న సమాచారంతో అక్కడికి వెళ్లి పరిశీలించగా షేక్‌శాన్‌, మేకల రమేశ్‌, సయ్యద్‌ హుస్సేన్‌, పిప్పెర రాజేశ్‌గౌడ్‌ను పట్టుకున్నట్లు తెలిపారు. వారి నుంచి 600 గ్రాముల గంజాయి లభ్యమైందని దీని విలువ సుమారు రూ. 15 వేలు ఉంటుందని అన్నారు. నిజామాబాద్‌కు చెందిన యూనుస్‌ అనే వ్యక్తి నుంచి వీరు కొనుగోలు చేసినట్లు నిందితులు తెలిపారు. వీరి నుంచి నాలుగు ఫోన్లు, బైక్‌ను స్వాధీనం చేసుకొని కోర్టులో హాజరు పర్చినట్లు ఎస్సై తెలిపారు. తనిఖీలో సిబ్బంది రాజ్‌కుమార్‌, రంజిత్‌, దయానంద్‌ ఉన్నారు.

జిల్లా కేంద్రంలో..

ఖలీల్‌వాడి: జిల్లా కేంద్రంలో గంజాయి రవాణా చేస్తున్న మహ్మద్‌ యూనస్‌ను అరెస్ట్‌ చేసినట్లు సీఐ దిలీప్‌ తెలిపారు. నిందితుడి నుంచి 1.2 కేజీల గంజాయి, ఒక బైక్‌ను స్వాధీనం చేసుకొని సీజ్‌ చేసినట్లు చెప్పారు. దాడుల్లో ఎస్సై మల్లేశ్‌, సిబ్బంది ప్రభాకర్‌, షబ్బీర్‌, సాయిశ్యాం, సంజయ్‌, సంగయ్య, రవి పాల్గొన్నారు.

నంబర్‌ ప్లేట్‌లేని వాహనాలు పట్టివేత

ఖలీల్‌వాడి: నగరంలోని పలు చోట్ల నంబర్‌ప్లేట్‌ లేని 61 వాహనాలను పట్టుకుని జరిమానా విధించినట్లు ట్రాఫిక్‌ ఏసీపీ నారాయణ మంగళవారం తెలిపారు. నగరంలోని ట్రాఫిక్‌ల వద్ద సీఐ చందర్‌ రాథోడ్‌, ఆర్‌ఐ సతీశ్‌, ఎస్సైలు చంద్రశేఖర్‌, సుమన్‌ నంబర్‌ ప్లేట్‌ వాహనాలను పట్టుకొని జరిమానా విధించారు. వాహనదారులు తప్పనిసరిగా నంబర్‌ ప్లేట్‌, ధ్రువీకరణపత్రాలు తమ వద్ద ఉంచుకోవాలని సూచించారు.

ఐదుగురి బైండోవర్‌

మోపాల్‌: మండలంలోని ఐదు గ్రామాల్లో పలువురిని తహసీల్దార్‌ ఎదుట పోలీసులు మంగళవారం బైండోవర్‌ చేశారు. మండలంలోని న్యాల్‌కల్‌, సిర్‌పూర్‌, మంచిప్ప, ముదక్‌పల్లి, బాడ్సి గ్రామాల్లో బెల్ట్‌షాపు నిర్వహిస్తున్న పలువురిని ఎన్నికల కమిషన్‌ ఆదేశాల మేరకు బైండోవర్‌ చేసినట్లు పేర్కొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

ఖలీల్‌వాడి: నగరంలోని పద్మానగర్‌లో పేకాట ఆడుతున్న ఐదుగురిని అరెస్టు చేసినట్లు ఎస్సై సంజీవ్‌ తెలిపారు. వీరి నుంచి నాలుగు సెల్‌ఫోన్లు, నగదు స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

రెండు ఆర్టీసీ బస్సులు ఢీ

- ప్రయాణికులకు గాయాలు



నాగిరెడ్డిపేట(ఎల్లారెడ్డి): మండలంలోని బంజారతండా వద్ద మంగళవారం రాత్రి రెండు ఆర్టీసీ బస్సులు ఢీకొన్న ఘటనలో ఇద్దరు ప్రయాణికులకు గాయాలైనట్లు ఎస్సై రాజు తెలిపారు. బంజారతండాలో బోధన్‌ డిపోకు చెందిన బస్‌ ఎదుట పశువులు అడ్డురాగా డ్రైవర్‌ సడెన్‌ బ్రేక్‌ వేయడంతో వెనకాలే వస్తున్న మెదక్‌ డిపోకు చెందిన ఆర్డినరీ బస్‌ ఢీ కొన్నది. ఈ ఘటనలో బోధన్‌ బస్‌లో ప్రయాణిస్తున్న ప్రయాణికుడు గోకునూరి సాయాగౌడ్‌, మెదక్‌ బస్‌లో ప్రయాణిస్తున్న చాకలి విఠల్‌కు గాయాలయ్యాయి. వీరిని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఎస్సై రాజు ఘటనాస్థలికి చేరుకొని విచారణ చేపట్టారు. ప్రమాదంలో గాయపడ్డ క్షతగాత్రుల వివరాలను సేకరించారు.

రోగులపై ఇంత నిర్లక్ష్యమా..



కామారెడ్డి టౌన్‌: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో వైద్యం కోసం వచ్చే రోగులకు సరైన వసతులు లేకపోవడంతో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మంగళవారం తీవ్ర గాయాలైన ఓ యువకుడిని ఆసుపత్రిలోని మొదటి అంతస్తుకి తీసుకెళ్లాల్సి ఉండగా వీల్‌చైర్‌ లేకపోవడంతో కుటుంబీకులు చేతులపైనే మొదటి అంతస్తు వరకు తీసుకెళ్లారు. ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం వచ్చే రోగులపై ఇంత నిర్లక్ష్యం తగదంటూ పలువురు ఆరోపిస్తున్నారు.

ఏటీఎం చోరీకి యత్నం



నిందితులు వదిలేసి వెళ్లిన మిషన్‌ భాగాలు, ట్రాక్టర్‌

వేల్పూర్‌: అంక్సాపూర్‌ గ్రామంలోని యూనియన్‌ బ్యాంక్‌ ఏటీఎంను దొంగలు చోరీ చేసేందుకు విఫలయత్నం చేశారు. గ్రామస్తులు నిద్రలేవడంతో నిందితులు పరారయ్యారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం.. సోమవారం అర్ధరాత్రి పోలీసులు పెట్రోలింగ్‌ చేసిన తర్వాత నిందితులు ఏటీఎంలో ప్రవేశించినట్లు సీసీ కెమెరాలో నమోదైంది. పాత ఇరిగేషన్‌ భవనం వద్ద ఉన్న జీపీ ట్రాక్టర్‌ను దొంగిలించి బ్యాంకు వద్దకు తెచ్చారు. అందులో ఏటీఎం మిషన్‌ను తీసుకెళ్లేందుకు ప్రయత్నించారు. మిషన్‌ను బయటకు తీసుకొచ్చి ట్రాక్టరులో ఎక్కించే క్రమంలో ఇంజిన్‌కు, ట్రాక్టరు ట్రాలీకి మధ్య భాగంలో ఇరుక్కుంది. దీంతో ట్రాక్టర్‌ ఇంజిన్‌ ముందుభాగం లేచి కదలకుండా మారింది. ఆ శబ్దానికి చుట్టుపక్కల వారు లేచి అరవడంతో నిందితులు పరారయ్యారు. ఘటన స్థలాన్ని ఆర్మూర్‌ ఏసీపీ జగదీశ్‌, ఆర్మూర్‌ రూరల్‌ సీఐ గోవర్ధన్‌రెడ్డి పరిశీలించి వివరాలు సేకరించారు. బ్యాంకు అధికారుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు తెలిపారు. జక్రాన్‌పల్లి మండలానికి చెందిన పాత నేరస్తులు ఏటీఎం చోరీకి యత్నించిన దొంగలుగా గుర్తించి, వారిని పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు విశ్వసనీయ సమాచారం.

వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

రుద్రూర్‌: చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు నీట మునిగి ఓ వృద్ధుడు మృతి చెందిన ఘటన అంబం (ఆర్‌) జీపీ పరిధిలోని కొండాపూర్‌ చెరువులో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్సై నీరేశ్‌ తెలిపిన వివరాల ప్రకారం.. కొండాపూర్‌ గ్రామానికి చెందిన దశరథ్‌(60) మరొకరితో కలిసి సోమవారం రాత్రి చేపలు పట్టేందుకు గ్రామ చెరువుకు వెళ్లారు. చేపలు పడుతుండగా దశరథ్‌ ప్రమాదవశాత్తు నీటమునిగి మృతి చెందాడు. మృతుడి కుమారుడు శంకర్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

చెరువులో స్నానానికి వెళ్లి ఒకరు..

కోటగిరి (రుద్రూర్‌): మండల కేంద్రానికి చెందిన దేశాయ్‌పేట్‌ వీరేశం (40) స్థానిక దామర చెరువులో ప్రమాదవశాత్తు మునిగి మృతి చెందినట్లు ఎస్సై సందీప్‌ మంగళవారం తెలిపారు. సోమవారం సాయంత్రం స్నానం చేసి వస్తానని ఇంట్లో చెప్పి వెళ్లిన వీరేశం తిరిగిరాలేదు. కుటుంబ సభ్యులు గాలిస్తుండగా మంగళవారం ఉదయం మృతదేహం లభ్యమైంది. మృతుడి కుమారుడు సాయికుమార్‌ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.

గ్యాస్‌ సిలిండర్‌కు మంటలు



సిలిండర్‌కు అంటుకున్న మంటలు

బీబీపేట: అకస్మాత్తుగా వంట గ్యాస్‌కు మంటలు అంటుకొని చెలరేగిన మంటలకు ఇళ్లు పాక్షికంగా దెబ్బతిన్న ఘటన మండల కేంద్రంలో మంగళవారం చోటు చేసుకుంది. మండల కేంద్రానికి చెందిన ఇల్లెందుల రాజు తన ఇంట్లో వంట చేస్తుండగా అకస్మాత్తుగా గ్యాస్‌ సిలిండర్‌కు మంటలు వ్యాపించాయి. దీంతో ఇంటి పైకప్పుకు మంటలు అంటుకున్నాయి. సిలిండర్‌ను కర్ర సహాయంతో బయటకు తీసుకురావడంతో ప్రమాదం తప్పింది. చుట్టూ ఇళ్లు ఉండడం, జనాలు గుమిగూడడంతో కాలనీ వాసులు భయాందోళనకు గురయ్యారు. చివరికి ఫైర్‌ ఇంజిన్‌ వచ్చి మంటలను ఆర్పివేయడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ఇదిలా ఉండగా అదే ఇంట్లో అక్రమంగా గ్యాస్‌ సిలిండర్లను నిల్వ ఉంచుకొని వాహనాలకు గ్యాస్‌ రీఫిల్లింగ్‌ చేస్తాడని, దానివల్లే ప్రమాదం సంబవించినట్లు పలువురు కాలనీ వాసులు అనుమానం వ్యక్తం చేశారు. ఇళ్ల మధ్య గ్యాస్‌ రీఫిల్లింగ్‌ను అధికారులు గుర్తించి చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

పెర్కిట్‌లో చైన్‌స్నాచింగ్‌

ఆర్మూర్‌టౌన్‌: మున్సిపల్‌ పరిధిలోని పెర్కిట్‌లో రుచిత అనే మహిళ మెడ నుంచి రెండున్నర తులాల బంగారు చైన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు ఎతుకెళ్లారు. బాధితురాలు తెలిపిన వివరాల ప్రకారం.. మామిడిపల్లిలో పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వెళ్తుండగా వెనుక నుంచి స్కూటీపై వచ్చిన దుండుగులు మెడలో ఉన్న బంగారు గొలుసును ఎత్తుకెళ్లినట్లు పేర్కొన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు బాధితురాలు వెల్లడించారు.

ఐదు కిలోల క్లోరోహైడ్రేట్‌ పట్టివేత



బోధన్‌టౌన్‌(బోధన్‌): పట్టణంలోని జూనియర్‌ కళాశాల సమీపంలో ఐదు కిలోల క్లోరోహైడ్రేట్‌తో తిరుగుతున్న ముగ్గురిని పట్టుకున్నట్లు ఎక్సైజ్‌ సీఐ రూప్‌సింగ్‌ మంగళవారం తెలిపారు. మండలంలోని బర్దిపూర్‌, కుమ్మన్‌పల్లి గ్రామాలకు చెందిన జగదీశ్‌గౌడ్‌, నాగేశ్‌గౌడ్‌, రాకాసీపేట్‌కు చెందిన శంకర్‌గౌడ్‌ నుంచి ఐదు కిలోల క్లోరోహైడ్రేడ్‌ను స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. అనంతరం వీరిపై కేసునమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

ఆటో బోల్తా పలువురికి గాయాలు

గాంధారి(ఎల్లారెడ్డి): మండల కేంద్రంలోని ప్రధాన రహదారిపై ఆటో బోల్తాపడిన ఘటనలో పలువురు కూలీలకు గాయాలైనట్లు స్థానికులు తెలిపారు. మండలంలోని రాంపూర్‌ గడ్డ తండాకు చెందిన ఎనిమిది మంది వ్యవసాయ కూలీలు ఆటోలో పోతంగల్‌ శివారులో పని నిమిత్తం వెళ్తుండగా సాంకేతిక లోపంతో ఆటో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌తో పాటు కూలీలకు గాయాలయ్యాయి. స్థానికులు క్షతగాత్రులను మండల కేంద్రంలోని ప్రభుత్వ, కామారెడ్డి ఏరియా ఆసుపత్రికి తరలించారు.

బెల్ట్‌షాపులపై పోలీసుల దాడులు



బ్రాహ్మణపల్లిలో తనిఖీ చేస్తున్న పోలీసులు

ఎడపల్లి/ తాడ్వాయి/ ఎల్లారెడ్డి/ నాగిరెడ్డిపేట/ రాజంపేట/ బీబీపేట/ రామారెడ్డి/ ఖలీల్‌వాడి: ఎన్నికల కోడ్‌ అమలులోకి వచ్చినందున ఉమ్మడి నిజామాబాద్‌ జిల్లాలోని గ్రామాల్లో బెల్ట్‌షాపులపై పోలీసులు సోమవారం రాత్రి, మంగళవారం దాడులు నిర్వహించారు. అక్రమంగా మద్యం విక్రయిస్తున్న వారిని అరెస్టు చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఎడపల్లి మండలంలోని ఠాణాకలాన్‌, కుర్నాపల్లి గ్రామాల్లోని బెల్ట్‌షాపులపై పోలీసులు దాడులు నిర్వహించారు. దాడుల్లో సుమారు రూ.41 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఠాణాకలాన్‌కు చెందిన మురళీగౌడ్‌, భూమాగౌడ్‌, కుర్నాపల్లికి చెందిన పరశురాంగౌడ్‌ను అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై విక్రం తెలిపారు. తాడ్వాయి మండలంలోని బ్రాహ్మణపల్లిలో అక్రమంగా మద్యాన్ని నిల్వ ఉంచి ఓ ఇంటిపై దాడి చేసినట్లు స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై ఆంజనేయులు తెలిపారు. గ్రామానికి చెందిన అబ్బాగోని కిష్టాగౌడ్‌ తన ఇంట్లో అక్రమంగా మద్యం అమ్ముతున్నట్లు విచారణలో తేలడంతో కేసు నమోదు చేసినట్లు చెప్పారు. స్వాధీనం చేసుకున్న మద్యం విలువ రూ. 43 వేలు ఉంటుందని అన్నారు. ఎల్లారెడ్డి మండలంలోని శివాపూర్‌, లక్ష్మాపూర్‌ గ్రామాల్లో సత్యనారాయణ, అనసూయల వద్ద రూ. 15 వేల విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు ఎస్సై గణేశ్‌ తెలిపారు. నాగిరెడ్డిపేట మండలంలోని తాండూర్‌లో బేస్త రాజు తన దుకాణంలో అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్నట్లు సమాచారం అందడంతో దాడి చేసి మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రాజు తెలిపారు. వీటి విలువ రూ.15,513 ఉంటుందని అన్నారు. రాజంపేట మండలం బస్వన్నపల్లిలో ఓ బెల్ట్‌ షాపులోని మద్యాన్ని స్వాధీనం చేసుకొని సీజ్‌ చేసినట్లు ఎస్సై సంపత్‌ తెలిపారు. వీటి విలువ సుమారు రూ.70 వేలు ఉంటుందని పేర్కొన్నారు. బీబీపేట మండలంలోని మాందాపూర్‌లో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బెల్ట్‌షాపు నిర్వాహకుడు లింగాల వెంకటస్వామిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై సాయిరెడ్డి తెలిపారు. వీటి విలువ రూ. 17,270 ఉంటుందని అన్నారు. రామారెడ్డి మండలంలోని గిద్ద గ్రామంలో అక్రమంగా మద్యం విక్రయిస్తున్న బాలరాజుపై కేసు నమోదు చేసి రూ. 9వేలు విలువ చేసే మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై సుధాకర్‌ తెలిపారు. నగరంలోని ఆరో టౌన్‌ పీఎస్‌ పరిధిలోని బెల్ట్‌ షాపుల్లో మద్యాన్ని స్వాధీనం చేసుకున్నట్లు ఎస్సై రవీందర్‌ తెలిపారు. నిర్వాహకుడు దీపక్‌పై కేసు నమోదు చేసినట్లు పేర్కొన్నారు.